# భగ్గుమంటున్న బహుజనం




### బీసీలను మోసం చేసేందుకే 'కులగణన సర్వే'

- ప్రతి ఏడాది పెరగాల్సిన జనాభా ఎలా తగ్గింది?
- రిజర్వేషన్ల శాతాన్ని తగ్గించేందుకు రేవంత్ సర్కార్ కుట్ర
- 42శాతం రిజర్వేషన్ అమలు చేయకుంటే ఖబడ్దార్!
- కాంగ్రెస్ వంచనపై మండిపడుతున్న బీసీ ప్రజలు
- వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామంటూ ఆగ్రహం

**కులగణన** సర్వేలో బీసీల జనాభాను తగ్గించి చూపి మోసానికి పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బహుజనులు భగ్గుమంటున్నారు. అధికారం చేపట్టగానే రాజ్యాంగబద్ధంగా బీసీ రిజర్వేషన్లు తెస్తామని, వాటి ప్రకారం 42శాతం కోటా కల్పిస్తామని హామీ ఇచ్చి ఇప్పడేమో వంచనకు పాల్పడుతుందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం పెరగాల్సిన జనాభా.. కేవలం బీసీల్లోనే ఎలా తగ్గుతుందని ప్రశ్నించారు. బీసీలకు ద్రోహం చేసి ఓసీలకు మేలు చేసేందుకే వారి జనాభా పెరిగినట్లు చెబుతోందని ధ్వజమెత్తారు. తమకు అన్యాయం చేయాలని చూస్తే కాంగ్రెస్‌కు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని తీర్మానాలు చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం.. బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. అసెంబ్లీలో తీర్మానించి పంపిన బిల్లును కేంద్రప్రభుత్వం ఆమోదించాలంటూ మెలికపెడితే ఊరుకోమని హెచ్చరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై చేస్తున్న మోసాన్ని ఖండిస్తూ అన్ని బీసీవర్గాల ప్రజలు తమ అభిప్రాయాలు వెల్లడిస్తున్నారు.

- నమస్తే నెట్‌వర్క్



### బీసీలను తగ్గించి చూపడం సరికాదు



తప్పుడు సర్వేలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తే ఎవరూ ఊరుకోరు. 2011లో ఉన్న జనాభాకు ఇప్పటికి తక్కువ చూపించి బీసీలను తగ్గించడం సరికాదు. అందరి కంటే ఎక్కువగా ఉన్న బీసీలను పాత లెక్కల ప్రకారం తక్కువగా చూపించి.. ఓసీలను ఎక్కువ చేసి చూపించడంలో ఆంతర్యమేమిటో అర్థమైంది. బీసీలను 46 శాతానికి కుదించి వారి హక్కులను ప్రభుత్వం కాలరాస్తోంది. భవిష్యత్‌లో బడుగుల సత్తా ఏమిటో చూపిస్తాం.

–కాపు సీతాలక్ష్మి,
మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, కొత్తగూడెం

### బీసీలను అణచివేసేలా సర్వే



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన కులగణన బీసీలను అణచివేసే విధంగా ఉంది. సర్వేలో బీసీలను తగ్గించి చూపడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. సర్వే ఫలితాలను సమీక్షించి పారదర్శకతతో గణాంకాలను వెల్లడించాలి. కులగణన సర్వేలో జరిగిన తప్పులను సవరించి బీసీలకు న్యాయం జరిగే విధంగా చూడాలి. ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టి చిత్తశుద్ధిని చాటుకోవాలి.

–అచ్చన రామకృష్ణ, బీఆర్ఎస్ నాయకుడు, కురుమ సంఘం మండల మాజీ అధ్యక్షుడు, అన్నపురెడ్డిపల్లి

### రిజర్వేషన్ అమలు చేశాకే ఎన్నికలు



బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసిన తర్వాతే పంచాయతీ ఎన్నికలు పెట్టాలి. ప్రభుత్వం కులగణన సర్వే సరిగా చేయలేదు. గతంలో ఉన్న బీసీల సంఖ్య కంటే ప్రస్తుతం ఉన్న బీసీల సంఖ్య పెరగాలి కానీ తగ్గింది. మళ్లీ పూర్తిస్థాయి సర్వే చేయాలి. బీసీ సర్వేపై అన్ని కులాల నుంచి వ్యతిరేకత వస్తోంది.

–పోగు వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకుడు, కరకగూడెం మండలం

### మోసం చేసేందుకు కుట్ర



రాష్ట్రంలోని బీసీలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతుంది. సీఎం రేవంత్‌రెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి. లేనిపక్షంలో ఎక్కడికక్కడే ఆందోళనలు చేపడతాం.

–రావుల సోమయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, కరకగూడెం

### శాస్త్రీయత లేని కులగణన



రాష్ట్ర ప్రభుత్వం హడావిడిగా చేపట్టిన కుల గణనకు శాస్త్రీయత లేదు. బీసీలకు రాజకీయ రంగంలో రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో ప్రభుత్వం రెండు నాల్కల ధోరణి అవలంబిస్తుంది. ఇంకా 3.1 శాతం జనాభాను సర్వే చేకుండానే బీసీల లెక్కను ఎలా నిర్ధారించారో ప్రభుత్వ పెద్దలు చెప్పాలి. బీసీలకు అన్యాయం చేయాలని చూస్తే ఉద్యమాలు చేస్తాం. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందే.

–బత్తిని మధుగౌడ్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు

### కులగణన తప్పుల తడక..



ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణనలో తప్పుల తడక మాదిరిగా ఉంది. బీసీలకు అన్యాయం చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతుంది. ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు పెంచాలి. నామమాత్రపు సర్వేతో బీసీలకు అన్యాయం చేస్తే ఊరుకోం.

–బుడగం రాము, బీసీ నాయకుడు, కరకగూడెం మండలం

### పారదర్శకత లోపించింది..



కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణనలో పారదర్శకత లేదు. నామమాత్రపు సర్వే చేసి కావాలనే బీసీ లెక్కలు తక్కువ చేసి చూపారు. బీసీలకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోం. మరోసారి కులగణన చేపట్టి జనాభాను ప్రకటించాలి. బీసీల రిజర్వేషన్ స్థానం పెంచి రాజకీయంగా అవకాశం కల్పించాలి.

–అత్తే సత్యనారాయణ, బీసీ నాయకుడు, అనంతారం, కరకగూడెం మండలం

### తప్పుల తడకగా సర్వే నివేదిక



చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని అశాస్త్రీయమైన సర్వేలు చేసి తప్పుల తడకలుగా నివేదికలు ప్రకటించి చేతులు దులుపుకున్నారు. కామారెడ్డిలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కొత్తగా సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ పరంగా రిజర్వేషన్లు అంటూ బీసీలతో డ్రామాలు ఆడుతున్నారు. బీసీల జనాభా తక్కువ చేసి చూపించిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల రాజకీయ అవకాశాలను కొల్లగొట్టేందుకు ప్రయత్నిస్తుంది. దీనిపై పోరాటాలకు సిద్ధమవుతున్నాం.

–దరిపల్లి వీరబాబు, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు

### 50 శాతానికి మించి బీసీలు



అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు బీసీల కులగణన విషయంలో చెప్పినవన్నీ అబద్ధాలే. బీసీల జనాభా రాష్ట్రంలో 50 శాతానికి మించి ఉంటుంది. అశాస్త్రీయమైన లెక్కలతో బీసీల అవకాశాలను కొల్లగొట్టేందుకు కాంగ్రెస్ పార్టీ అగ్రవర్ణాలకు వత్తాసు పలుకుతుంది. సర్వే నివేదికలను సమీక్షించి బీసీలను న్యాయం చేయాలి. బీసీల విషయంలో తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే ప్రజా క్షేత్రంలో నిలదీస్తాం.

–పేరం వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఖమ్మం రూరల్ మండలం

## ఖమ్మంలో 'లలితా జ్యువెల్లరి' మార్ట్ ప్రారంభం

### ముఖ్యఅతిథులుగా పాల్గొన్న మంత్రులు తుమ్మల, పొంగులేటి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లలితా జ్యువెల్లరి అధినేత డాక్టర్ కిరణ్‌కుమార్

రఘునాథపాలెం, ఫిబ్రవరి 8 : నమ్మకానికి, నాణ్యతకు చిరునామాగా 'లలితా జ్యువెల్లరి' రెండు తెలుగు రాష్ట్రాల్లో పేరొందిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఖమ్మం నగరంలో లలితా జ్యువెల్లరి 60వ షోరూం ప్రారంభమైంది. వైరా రోడ్డులో ఏర్పాటు చేసిన నూతన షోరూమ్ ప్రారంభోత్సవానికి మంత్రులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. లలితా జ్యువెల్లరిని స్థాపించి ఉమ్మడి రాష్ట్రాల్లో సంస్థ అధినేత డాక్టర్ యం.కిరణ్‌కుమార్ అందిస్తున్న సేవలను వారు ప్రశంసించారు. 41ఏళ్లకు పైగా సేవలందిస్తూ దక్షిణ భారతదేశంలోనే అగ్రగామిగా గుర్తింపు తెచ్చుకున్న సంస్థగా లలితా జ్యువెల్లరి నిలిచిందన్నారు. ఇప్పుడు ఉమ్మడి జిల్లాల ప్రజలకు ఖమ్మంలో అందుబాటులోకి తీసుకొచ్చినందుకు వారు అభినందించారు. ఈ సందర్భంగా మంత్రులకు లలితా జ్యువెల్లరి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్‌కుమార్ షోరూమ్ మొత్తం చూపించి అందుబాటులో ఉన్న పలురకాల వెరైటీ బంగారు, వజ్రాభరణాల గురించి వివరించారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఆకర్షణీయమైన పథకాలను తీసుకొచ్చినట్లు విలేకరుల సమావేశంలో కిరణ్‌కుమార్ వెల్లడించారు. తయారీ ధరకే బంగారు, వజ్రాభరణాలు అందించేందుకు లలితాజ్యువెల్లరి సిద్ధంగా ఉందన్నారు. నగల తయారీ సంస్థలో తమకు 41ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉందని పేర్కొన్నారు. తక్కువ తరుగు, లైట్ వెయిట్‌లో నగలు, లలితా వారి వందనం 11నెలల నగల కొనుగోలు పథకం వంటివి షోరూంలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ శ్రేణులు సైనికుల్లా పని చేయాలి

- స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం
- కాంగ్రెస్ అబద్ధపు హామీలను ప్రజలకు వివరించాలి
- బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



సమావేశంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు

కరకగూడెం, ఫిబ్రవరి 8 : స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపునిచ్చారు. మండలంలోని అనంతారం గ్రామంలో 7 పంచాయతీ స్థానాలు, 2 ఎంపీటీసీ స్థానాల పరిధిలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలతో శనివారం రాత్రి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలలు దాటినా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. పాలనను పక్కన పెట్టి కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టి ప్రభుత్వం లబ్ధి పొందేందుకు ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలతో ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందన్నారు. గడపగడపకూ తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను, గత కేసీఆర్ ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కష్టపడి పనిచేసిన ప్రతీ కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రావుల సోమయ్య, నాయకులు కొమరం రాంబాబు, అత్తె సత్యనారాయణ, నాగేశ్వరరావు, ఊకే రామనాథం, కొమ్మ సత్యనారాయణ, సలుగు భిక్షపతి, పసునూరి అంజయ్య, రంజిత్, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలి

- వయసుతో నిమిత్తం లేకుండా క్రీడాంశాల్లో ప్రతిభా ప్రదర్శన
- వార్షిక స్పోర్ట్స్ మీట్ ముగింపు వేడుకల్లో ఎస్పీ రోహిత్ రాజు




కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న పోలీస్ అధికారులు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఫిబ్రవరి 8 : ఆటల్లో చూపిన పోరాట పటిమను ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో సైతం చూపించి సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించాలని ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు అన్నారు. కొత్తగూడెంలోని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీస్ వార్షిక స్పోర్ట్స్ మీట్–2025 శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత 100 మీటర్ల పరుగు పందెం, టగ్ ఆఫ్ వార్ ఫైనల్ మ్యాచ్‌లను ఆయన తిలకించారు. అనంతరం మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది ఎంతో ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొని ఆసక్తి కనబరచడం ఆనందాన్నిచ్చిందన్నారు. వయసుతో సంబంధం లేకుండా కొందరు అధికారులు, సిబ్బంది వారు ఎంచుకున్న క్రీడాంశంలో ప్రతిభను ప్రదర్శించడం వారిలో ఉన్న క్రీడా స్ఫూర్తికి నిదర్శనమన్నారు. స్పోర్ట్స్ మీట్‌లో విభాగాల వారీగా జరిగిన క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, వారికి మెడల్స్ అందజేశారు. స్పోర్ట్స్ మీట్‌ను పకడ్బందీగా నిర్వహించిన అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సబ్ డివిజన్ల వారీగా పోలీసు క్రీడాకారులు ప్రదర్శించిన గౌరవ వందనాన్ని ఎస్పీ స్వీకరించారు. భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్ విజ్ఞప్తి మేరకు ఎస్పీ స్పోర్ట్స్ మీట్‌ను ముగిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని పోలీస్ అధికారులు, సిబ్బంది తమ ఆనందోత్సాహాలను పంచుకున్నారు.

## గూడేల్లో మౌలిక వసతులు కల్పిస్తాం..

- గిరిజన యువతకు కంప్యూటర్, మొబైల్ రంగాల్లో శిక్షణ
- అంతర్గత పంటలుగా ఆయిల్‌పాం, కూరగాయలు పండించాలి
- పూసుగుంటలో పర్యటించిన కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్



కొండరెడ్లతో మాట్లాడుతున్న కలెక్టర్, అధికారులు

దమ్మపేట, ఫిబ్రవరి 8 : కొండరెడ్ల గూడేల్లో మౌలిక వసతులు కల్పించి, వారి ఆర్థికాభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. పూసుగుంట కొండరెడ్ల గ్రామంలో ఐటీడీఏ పీవో రాహుల్‌తో కలిసి కలెక్టర్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గూడేల్లో చదువుకున్న యువత ఉంటే వారికి కంప్యూటర్, మొబైల్ రంగాలకు సంబంధించిన శిక్షణ ఇప్పించి ఆర్థిక వెసులుబాటు కల్పించాలని సూచించారు. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల వైపు దృష్టి మళ్లించే విధంగా గిరిజనులను ప్రోత్సహించాలని, పశు పోషణ కోసం షెడ్ల నిర్మాణం చేపట్టి పాల డెయిరీ సౌకర్యం కల్పించాలన్నారు. వ్యవసాయ భూములు ఉన్న రైతులు అంతర్గత పంటగా ఆయిల్‌పామ్, కూరగాయలు, ఆకు కూరలు వేసుకునేలా చూడాలన్నారు. ఉమ్మడి కుటుంబాలతో నివసిస్తున్న వారికి పశువులు, మేకలు ఇప్పిస్తామని, వాటి మేత కోసం మునగ, వేరుశనగ, సుబాబుల్ మొక్కలు వేసుకునేలా శిక్షణ అందిస్తామన్నారు. గిరిజనుల భూ సమస్యలను పరిష్కరిస్తామని, ఆధార్ కార్డులు అందిస్తామని తెలిపారు. ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని, నిరుద్యోగ యువతకు కావాల్సిన సిమెంటు పోల్ మేకింగ్ యూనిట్, ఇటుకల తయారీ మిషన్లు అందిస్తామన్నారు. అనంతరం గ్రామంలోని కమ్యూనిటీ హాలులో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పై అంశాలకు సంబంధించి అధికారులు ప్రతిపాదనలు రూపొందించి తనకు పంపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ వాణి, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ శ్రీనివాస్, ఐటీడీఏ డీఈ బాపనయ్య, డీఎఫ్‌వో కరుణాకరాచారి, జేడెం హరికృష్ణ పాల్గొన్నారు.

## ఏడో దశలో నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి

### యూనిట్‌లో సంబురాలు చేసుకున్న ఇంజినీర్లు



యూనిట్‌లో కేక్ కట్ చేస్తున్న కేటీపీఎస్ అధికారులు

పాల్వంచ, ఫిబ్రవరి 8 : పాల్వంచలోని కేటీపీఎస్ ఏడో దశ కర్మాగారం 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్‌లో వంద రోజులపాటు నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి కొనసాగింది. దీంతో ఏడో దశ కర్మాగారంలో ఇన్‌చార్జి సీఈ శ్రీనివాస బాబు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది శనివారం కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. 2024, అక్టోబర్ 31వ తేదీ నుంచి 2025, ఫిబ్రవరి 8వ తేదీ వరకు 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతూనే ఉంది. అయితే 2020, అక్టోబర్ 9వ తేదీ నుంచి 2021, జనవరి 25వ తేదీ వరకు 107 రోజులపాటు నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి చేసింది. ఆ రికార్డును అధిగమించే విధంగా ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది. దీంతో యూనిట్‌లో సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సీఈతోపాటు జాయింట్ సెక్రటరీ కేకే దుర్గామల్లేశ్వరి, ఎస్ఈలు శ్రీనివాస్, యుగపతి, డీటీ శేఖర్, ఇంజినీర్లు, కార్మికులు, ఆర్టిజన్లు పాల్గొన్నారు.

## జనక్‌ప్రసాద్ మాటలు సరికాదు

- ఆయన మానసిక స్థితి సరిగా లేనట్లుంది..
- టీబీజీకేఎస్ రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ, కూసన



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నాయకులు

రామవరం, ఫిబ్రవరి 8 : టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై, అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డిపై ఐఎన్‌టీయూసీ నేత జనక్‌ప్రసాద్ తప్పుడు మాటలు మాట్లాడటం సరికాదని టీబీజీకేఎస్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కాపు కృష్ణ, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కూసన వీరభద్రం అన్నారు. రామవరంలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలిగా కవిత ఎన్నికైన నాటి నుంచి కార్మికుల సంక్షేమ కోసం గత సీఎం కేసీఆర్‌తో మాట్లాడి అనేక హక్కులు తీసుకొచ్చారని గుర్తు చేశారు. సకల జనుల సమ్మె కాలానికి సమ్మె చేసి నష్టపోయిన జీతం తిరిగి చెల్లించడం, తెలంగాణ ఇంక్రిమెంట్, పెండింగ్‌లో ఉన్న 3,200 డిపెండెంట్ ఉద్యోగాలు ఇలా అన్నింటినీ అందించిన ఘనత కవితకే దక్కుతుందన్నారు. ఇలాంటి మంచి పనులన్నీ గుర్తు లేకనే ఐఎన్‌టీయూసీ నేత జనక్‌ప్రసాద్ మాట్లాడుతున్నారని, ఆయన మతిస్థిమితం బాగా లేదేమోననే అనుమానం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు గడప రాజయ్య, తుమ్మ శ్రీనివాస్, సూరి శంకర్, కాగితపు విజయ్‌కుమార్, మీసాల మురళి, అశోక్, రవివర్మ, సూర్యనారాయణ, సూపర్ రాజ్‌కుమార్, తిరుపతి, అనుదీప్ పాల్గొన్నారు.




మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616